సాక్షి చిత్తూరు

గురువారం । 12 । డిసెంబర్ । 2024



సాగునీటి సంఘాల ఎన్నికలు

జిల్లాలోని సాగునీటి సంఘాలకు ఈ నెల 14న ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. - 8లో



సర్వేలోనూ చిన్నచూపేనా..!

సంచార జాతులను గుర్తించేందుకు చేపట్టిన సీడ్ సర్వేలో వారు అసలు లేరని సచివాలయ సిబ్బంది నివేదిక ఇచ్చారు. - 8లో



సారా ఊట ధ్వంసం

నగరి మండలం మాంగాడు దళితవాడలో ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి పెద్దఎత్తున సారా ఊటను ధ్వంసం చేశారు. - 8లో

న్యూస్‌రీల్

ఉపకరణాల నమోదుకు ప్రత్యేక శిబిరాలు



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు ఉపకరణాల నమోదుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ విద్యాధరి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఈ నెల 17వ తేదీ నుంచి 24 వరకు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల ఉపకరణాల ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న విభిన్న వారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఈ నెల 17వ తేదీన చిత్తూరు పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో, 18న ఎస్‌ఆర్ పురం జెడ్పీ హైస్కూల్‌లో, 19న పూతలపట్టు జెడ్పీ హైస్కూల్లో, 20న నగరి పీసీఎన్ ప్రభుత్వ బాలుర హైస్కూల్లో, 21న పుంగనూరు వేంకటేశ్వర ఆలయం వెనుక ఉన్న బీఆర్ ప్రభుత్వ హైస్కూల్లో, 22న పలమనేరు జెడ్పీ హైస్కూల్లో, 23న కుప్పం ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఉన్న రాజావారి పార్కులో, 24న రామకుప్పం జెడ్పీ హైస్కూల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ శిబిరాలకు హాజరయ్యే అభ్యర్థులు 2 సెట్ల ధ్రువీకరణ పత్రాలు, విభిన్న ప్రతిభావంతుల ఉపకరణాల దరఖాస్తుకు వికలత్వ ఫొటోలు04, ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు, ఫొటోలు 4, ఆధార్, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకుని రాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ కోరారు.

ట్రాన్స్‌కో అర్బన్ పరిధిలోకి పూతలపట్టు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో రూరల్ డివిజన్ పరిధిలోని పూతలపట్టు సెక్షన్‌ను అర్బన్ డివిజన్‌లోకి మార్చినట్లు ఎస్‌ఈ ఇస్మాయిల్‌అహ్మద్ తెలిపారు. జిల్లా విద్యుత్‌శాఖ కార్యాలయం ఏర్పాటు సమయంలో సెక్షన్లను మార్పు చేశారన్నారు. అప్పుడు పూతలపట్టు నియోజకవర్గంలోని పూతలపట్టు మండలం రూరల్ డివిజన్ పరిధిలో మిగిలిన మండలాలు అర్బన్ డివిజన్ పరిధిలో ఉంచారన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు ఒకే డివిజన్ పరిధిలో ఉంటే పాలన సౌలభ్యత ఉంటుందని ఉన్నతాధికారులకు నివేదిక పెట్టామన్నారు. దీంతో అర్బన్ డివిజన్ పరిధిలోని రూరల్–3 సబ్‌డివిజన్ కిందకి పూతలపట్టు మండలాన్ని చేర్చారన్నారు.


రేపు తిరువణ్ణామలైలో ఆంక్షలు

చిత్తూరు అర్బన్: తమిళ కార్తీక దీపాన్ని పురస్కరించుకుని తమిళనాడులోని తిరువణ్ణామలై ఆలయం వద్ద ఆంక్షలు పెట్టినట్లు చిత్తూరు ఎస్పీ మణికంఠ ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు నుంచి తిరువణ్ణామలై వెళ్లే భక్తులు కార్లను ఊరి బయట కేటాయించిన 13 ప్రాంతాల్లో మాత్రమే పార్కింగ్ చేయాలని, గిరివలయంలో నిబంధనలు పాటించాలని కోరారు. అక్కడ సహాయం కోసం తిరువణ్ణామలై పోలీసులు ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ – 9363622330, 9498100431 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సక్రమంగా బాధ్యతలు నిర్వర్తించాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పర్యవేక్షణను సక్రమంగా నిర్వర్తించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో బుధవారం ఆమె ప్రోగ్రాం ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గ వారీగా బాధ్యతలను అప్పగించారు. గర్భిణులకు సేవలు పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు.

కళాశాలలో తనిఖీ




విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న వృత్తి విద్యాధికారి సయ్యద్ మౌలా

గుడుపల్లె: విద్యతోనే ప్రతి ఒక్కరికీ మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా వృత్తి విద్యాధికారి సయ్యద్ మౌలా అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. కళాశాలలో సంకల్ప ప్రోగ్రాం, విద్యాశక్తి గురించి అధ్యాపకులు, విద్యార్థులకు తెలియజేశారు. సంకల్ప కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్రశ్నలు, జవాబులతో కూడిన మెటీరియల్‌ను అందించారు. విద్యార్థులకు అనుగుణంగా విద్యను అందించాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఆధారపడి ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణమనాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బియ్యం..మాయం!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో రేషన్ పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. పేదల కడుపు నింపడానికి పంపిణీ చేసే రేషన్‌బియ్యం జిల్లా సరిహద్దులు దాటుతోంది. ఇందులో అక్రమార్కులకు కొందరు అధికారుల అండదండలు ఉండడంతో బియ్యం వ్యాపారం సాఫీగా సాగుతోంది. రేషన్ పంపిణీలో కొందరు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల చేతివాటం మితిమీరింది. దీంతో పేదల బియ్యం పక్కదారి పడుతోంది. కందిపప్పు, చక్కెర బ్లాక్ మార్కెట్‌కు చేరుతోంది. జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం జోరుగా సాగుతున్నా.. ఆ శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పైగా ప్రశ్నించే గొంతును అక్రమార్కులు, అధికారులతో కలిసి నొక్కేస్తున్నారు.



జిల్లా సరిహద్దులు దాటుతున్న రేషన్ బియ్యం

- చేతివాటం ప్రదర్శిస్తున్న కొందరు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు
- పక్క రాష్ట్రంలో మన రేషన్ బియ్యానికి యమా డిమాండ్
- లబ్ధిదారులకు ఇచ్చే కందిపప్పు, చక్కెరకు కూడా కోత వేస్తున్న డీలర్లు
- ప్రశ్నించే గొంతులను నొక్కేస్తున్న అక్రమార్కులు
- బియ్యం రవాణాలో అధికారుల అండదండలు
- జిల్లాలో అస్తవ్యస్తంగా రేషన్ పంపిణీ



ఓ రేషన్ షాపు వద్ద క్యూలో పెట్టిన బ్యాగులు, రాళ్లు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో రేషన్ సరుకులు బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్నాయి. అక్రమార్కులకు కొందరు అధికారులు సహకరిస్తుండడంతో పేదల కడుపు నింపే రేషన్ జిల్లా సరిహద్దులు దాటుతోంది. జిల్లావ్యాప్తంగా మొత్తం 1,379 రేషన్ దుకాణాలు ఉన్నాయి. కూటమి అధికారంలోకి ఆయా పార్టీల నేతలు పథకం ప్రకారం వందలాది రేషన్ షాపులను దౌర్జన్యంగా, లాక్కున్నారు. పర్మినెంట్ షాపులను కూడా వదల్లేదు. ఎస్సీ, ఎస్టీ ఒంటరి మహిళల పట్ల కనీస కనికరం లేకుండా రేషన్ దుకాణాలను గుంజుకున్నారు. అధికారుల ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. తప్పుడు ఫిర్యాదులతో షాపుల్లో తనిఖీలు చేయించారు. ఈ దౌర్జన్యకాండను భరించలేక చాలామంది షాపులను వదిలేశారు. ఆ తర్వాత అధికారాన్ని అడ్డు పెట్టుకుని రేషన్ మాఫియాతో కొందరు డీలర్లు జత కలిశారు. పేదల సరుకులను ఆరగించేందుకు మార్గం సుగమం చేసుకున్నారు. ఇష్టానుసారంగా దోచేస్తున్నారు.

వేల టన్నుల సరుకు..

జిల్లావ్యాప్తంగా మొత్తం 5.40 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. వీరికి ప్రజా పంపిణీ పేరుతో ప్రభుత్వం ప్రతినెలా బియ్యం 15 వేల మెట్రిక్ టన్నులు, కందిపప్పు 543.300 టన్నులు, చక్కెర 350.201 టన్నులు అందిస్తోంది. తద్వారా నిరుపేదలు రాయితీ సరుకులను సద్వినియోగం చేసుకుని కడుపు నింపుకుంటున్నారు. అయితే కొందరు డీలర్లు, ఆపరేటర్లు పేదలకు అందాల్సిన సరుకులను గద్దల్లా పీక్కుతింటున్నారు.

కందితో కాసుల వేట..

అధికశాతం మంది డీలర్లు పోటీ పడి కందిపప్పుకు డీడీ కట్టి కడుతున్నారు. అయితే కార్డుదారులకు మాత్రం కంది పప్పు కరువుతోంది. తొలుత వెళ్లిన కొంతమందికి మాత్రమే పప్పు ఇస్తూ.. మిగిలిన వారికి లేదని చేతులెత్తేస్తున్నారు. తూకం వేసే సమయంలో కందిపప్పు ఇస్తున్నట్లు బయోమెట్రిక్ వేసుకుని.. బియ్యంతో సరి పెడుతున్నారు. కొన్నిచోట్ల పప్పు వచ్చినా రాలేదని చెప్పి.. కేవలం బియ్యంతో సరి పెడుతున్నారు. ఇలా మిగుల్చుకున్న పప్పును బ్లాక్ మార్కెట్లోకి అమ్మేస్తున్నారు. రాయితీ ద్వారా కందిపప్పు రూ.67లకే రాగా.. బయట మార్కెట్లో కేజీ ధర రూ.200 పలుకుతోంది. దీంతో రాయితీ కందిపప్పు కొందరు డీలర్లు, ఆపరేటర్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. అక్రమంగా కూడగట్టుకున్న రాయితీ కందిపప్పును బయట మార్కెట్లో కేజీ రూ.150 నుంచి రూ.170 వరకు విక్రయిస్తున్నారు. లేనిపక్షంలో పల్లెలోని చిల్లర దుకాణాల్లో అమ్మకానికి పెట్టేస్తున్నారు. కొందరైతే కందిపప్పును భారీ స్థాయిలో నిల్వ ఉంచి ఏటా దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి చీటీదారులకు అమ్మేస్తున్నారు. ఇదే మాదిరిగానే చక్కెర కూడా దారితప్పుతోంది.

పక్క రాష్ట్రాలకు రవాణా..

ప్రతి నెల 1వ తేదీ నుంచి 17 వరకు చౌక దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఈ బియ్యాన్ని 83 శాతం మంది తీసుకుంటున్నారు. అయితే ఈ బియ్యం పంపిణీలో గోల్‌మాల్ చోటు చేసుకుంటోంది. కొంతమంది డీలర్లు గోనెసంచెలతో సరుకులు తూకం వేస్తూ కార్డుదారులకు కోతలు పెడుతున్నారు. షాపుల్లో టన్నుల సరుకును అక్రమంగా నిల్వ చేసుకుని భారీగా అమ్మకాలు చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే కార్డుదారులకు సరుకులు ఇచ్చినట్టే ఇచ్చి షాపు వద్దే కేజీ ధర రూ.8 నుంచి రూ.12 వరకు కొనుగోలు చేసుకుంటున్నారు. ఇంకొంతమంది నేరుగా మార్కెట్‌లోకి వెళ్లి కేజీ రూ.12 వరకు అమ్ముకుంటున్నారు. మరికొందరు అక్రమ వ్యాపారులు ఊరూరా తిరిగి రేషన్ బియ్యాన్ని టన్నుల కొద్దీ సేకరిస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యం బడా వ్యాపారుల చేతుల్లోకి వెళ్తోంది. చిత్తూరు, పలమనేరు, నగరి, జీడీనెల్లూరు, యాదమరి, ఎస్‌ఆర్‌పురం, కార్వేటినగరం, పాలసముద్రం, బంగారుపాళ్యం, పుంగనూరు, చౌడేపల్లి, గుడిపాల వీ.కోట, కుప్పం, శాంతిపురం తదితర మండలాల నుంచి భారీ మొత్తంలో బియ్యం తరలిపోతోంది. అలా వెళ్లిన బియ్యం వారికి లక్షలాది రూపాయలు తెచ్చిపెడుతోందని అక్రమ వ్యాపారులు బహిరంగానే చెబుతున్నారు.

సన్నగా చేసి..



కొంతమంది వ్యాపారులు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తమిళనాడు, కర్ణాటకకు లారీల ద్వారా తరలిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. అక్కడ కేజీ రూ.20 నుంచి రూ.25 వరకు అమ్ముకుంటున్నారు. ఇందుకోసం అక్కడ ఓ దళారీ వ్యవస్థను ఏర్పరుచుకున్నారు. ఇక మిల్లర్లు సన్నబియ్యంగా మార్చేస్తున్నారు. అక్రమార్కులు కూడా ఇంట్లోనే మినీ మిషన్‌ను ఏర్పాటు చేసుకుని రేషన్ బియ్యాన్ని సన్నబియ్యంగా చేస్తున్నారు. ఈ బియ్యాన్ని మంచి బ్రాండ్ పేరిట మార్కెట్లోకి విక్రయిస్తున్నారు. ఇలా 26 కేజీల బ్యాగు రేషన్ బియ్యం మార్కెట్లో కేజీ రూ.1400 నుంచి రూ.1,700 వరకు అమ్ముతున్నారు. ఫలితంగా బడా వ్యాపారులు ప్రతి నెల కోట్లాది రూపాయలు అర్జిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సన్నబియ్యంగా మార్చే క్రమంలో వచ్చే పిండిని పాడి పశువులకు దాణాగా విక్రయిస్తున్నారు. అది కూడా కేజీ రూ.10. ఈ అక్రమ వ్యాపారానికి కూటమి నేతలే బ్రాండ్ అంబాసిడర్‌గా నిలుస్తున్నారనే విమర్శలు జిల్లాలో భగ్గుమంటున్నాయి. ఇచ్చే అర కేజీన్ని కూడా మింగేస్తూ తమను ఉసూరుమనిపిస్తున్నారని పలువురు కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులకు ఫిర్యాదు చేద్దామని చూస్తే..

మన రేషన్ బియాన్ని ఇతర రాష్ట్రాల ప్రజలు బంగారంలా కళ్లకు అద్దుకుని తింటున్నారు. ఈక్రమంలో కోట్లాది రూపాయలు విలువ చేసే టన్నుల బియ్యం జిల్లా సరిహద్దులు దాటి పక్క రాష్ట్రాలకు తరలుతోంది. కొంతమంది డీలర్లే ఈ బియ్యం దందా చేస్తున్నారని అధికారులకు తెలుసు. రేషన్ అక్రమంగా తరలిస్తున్నారని, సక్రమంగా రేషన్ ఇవ్వడం లేదని అధికారులకు ఫిర్యాదు చేస్తే..ముందుగానే సంబంధిత డీలర్లకు సమాచారం ఇచ్చి, అంతా చక్కబెట్టుకున్న తర్వాత దుకాణంలో తనిఖీ చేసి సమస్యలు లేకుండా సర్దేస్తున్నారు. కేవలం విజిలెన్స్, పోలీసు అధికారులు మాత్రమే కొంత మేర రేషన్ బియ్యం పట్టుకుంటున్నారు.

ఇంటింటి రేషన్‌కు మంగళం..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వాహనాల ద్వారా ఇంటి వద్దకే వచ్చి రేషన్ ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంటింటి రేషన్‌కు మంగళం పాడింది. పంపిణీ వాహనాలను మూలకు చేర్చారు. కూటమి శ్రేణులకు కాసులొచ్చేలా చౌకదుకాణాలను మార్చేశారు. ఇప్పుడు సరుకులు ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి. దీంతో దినసరి కూలీ పనులకు వెళ్లేవారు సరుకుల కోసం ఇబ్బంది పడుతున్నారు. డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు వచ్చేంత వరకు కొన్నిచోట్ల గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. మరికొన్ని చోట్ల రాళ్లు, సంచులు, డబ్బాలు క్యూలో పెట్టి వస్తున్నారు. దీంతో ప్రజా పంపిణీ అధ్వానంగా మారిందని కార్డుదారులు వాపోతున్నారు.

కేసులు పెడతాం..

పేదలకు అందించే రేషన్ బియ్యం, ఇతర సరుకులను కార్డుదారులకు అందించాలి. ఈ విషయంలో ఎవరైనా చేతివాటం ప్రదర్శిస్తే కచ్చితంగా వారిపై కేసులు పెడుతాం. తూకాల్లో మోసాలు ఉంటే సహించం. సరుకులు వచ్చినా.. రాలేదని చెబితే కార్డుదారులు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. రేషన్ బియ్యంతో అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకునేలా చేస్తాం. సకాలంలో రేషన్ అందకపోతే అధికారుల దృష్టికి తీసుకోరావచ్చు. – శంకరన్, డీఎస్‌ఓ, చిత్తూరు

బొమ్మసముద్రానికి జాతీయ అవార్డు

- హెల్తీ పంచాయతీ విభాగంలో అవార్డు అందుకున్న సర్పంచ్ రఘు
- రూ.కోటి ప్రోత్సాహక నగదు



రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ రఘు

ఐరాల: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, ప్రజాసమస్యల పరిష్కారం, పచ్చదనం, పారిశుద్ధ్య నిర్వహణ, వైద్య సేవలు వంటి అంశాల్లో చిత్తూరు జిల్లా, పూతలపట్టు నియోజకవర్గం, బొమ్మసముద్రం పంచాయతీ జాతీయ స్థాయిలో ఆరోగ్య పంచాయతీ (హెల్తీ పంచాయతీగా) ఎంపికైంది. దీన్ దయాల్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ పురస్కారాల్లో భాగంగా ఈ పంచాయతీకి జాతీయస్థాయిలో మొదటి స్థానం దక్కడం విశేషం. ఉత్తమ ఆరోగ్య పంచాయతీగా ఎంపిక కావడంతో సర్పంచ్ రఘు, ఎంపీడీఓ ధనలక్ష్మి, ఈఓపీఆర్డీ కుసుమకుమారి, పంచాయతీ కార్యదర్శి మౌనిక బుధవారం ఢిల్లీలో విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా సర్పంచ్ అవార్డు అందుకున్నారు. రూ.కోటి ప్రోత్సాహక నగదు బటన్ నొక్కి పంచాయతీ ఖాతాకు జమ చేశారు. పంచాయతీలో మాతా శిశు మరణాలను నివారించడం, పలు ఆరోగ్య సేవలు ప్రజలకు చేరవేయడంలో సర్పంచ్, పంచాయతీ సిబ్బంది, మండల అధికారులు, పాలకవర్గ సభ్యులు సమన్వయంతో పనిచేస్తూ వంద శాతం లక్ష్యాలను సాధించారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో జాతీయస్థాయి అవార్డుల్లో భాగంగా బొమ్మసముద్రం పంచాయతీ తొమ్మిది విభాగాల్లో దరఖాస్తు చేసుకోగా, ఆరోగ్య అంశంలో(హెల్తీ పంచాయతీ) జాతీయస్థాయిలో మొదటి స్థానం దక్కించుకుంది.

బాలికల భవిష్యత్‌కు కిశోరి వికాసం

- బాలికా సంఘాలు ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపండి
- జిల్లా స్త్రీ సంక్షేమశాఖ పీడీ హైమావతి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ హైమావతి

నగరి : బాలికల బంగారు భవిష్యత్తుకు కిశోరి వికాసం కార్యక్రమం పునాది వేస్తుందని, ఉజ్వల, ఆరోగ్యకరమైన, సాధికారిత దిశగా ఆమె వేసే అడుగుకు సమిష్టి కృషితో చేయూతనిద్దామని జిల్లా స్త్రీ సంక్షేమశాఖ పీడీ హైమావతి అన్నారు. బుధవారం స్థానిక ఐడీసీఎస్ కార్యాలయంలో నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి బాలిక భవిష్యత్‌ను మెరుగుపరచడానికి కిశోరి వికాసం మంచి అవకాశమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీఓల సమన్వయంతో కార్యక్రమం పునఃప్రారంభమైందన్నారు. 11–18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనను మెరుగుపరచడం ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. ఇందుకు ప్రతి గ్రామంలో బాలికల సంఘాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించడంతో పాటు, సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు చెప్పారు. డిజిటల్ భద్రత, సైబర్‌క్రైమ్, ఆన్‌లైన్ వేదికలపై జాగ్రత్తగా ఉండేలా అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీడీపీఓ కె.కృష్ణవేణి, డాక్టర్ సుస్మిత, ఎంపీడీఓ సతీష్, నోడల్ అధికారి ఇ.జయంతి, మున్సిపల్ మేనేజర్ శేఖర్, ఏపీఎం మోహన్, డాక్టర్ ఎయిల్‌అరసన్, హెచ్‌ఎం ప్రసన్న, సిరీడ్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు గిరిజ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ

- 13న చిత్తూరులోని దుర్గమ్మ గుడి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ



కరపత్రాలను విడుదల చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఇన్‌చార్జి కృపాలక్ష్మి



చిత్తూరులో పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంసీ విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా కేంద్రంలో 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ పెట్టుబడి సాయం అందక, మరోవైపు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బంది పడుతున్న అన్నదాతలకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలో రైతులతో కలిసి ప్రదర్శన చేపడతామన్నారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు స్థానిక దుర్గమ్మగుడి సమీపం నుంచి చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, జీడీనెల్లూరు (జీడీనెల్లూరు, ఎస్‌ఆర్‌పురం, పెనుమూరు మండలాల) ఇన్‌చార్జ్‌లు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు, రైతులతో కలిసి కలెక్టరేట్‌కు ప్రదర్శనగా వెళ్తామన్నారు. అనంతరం రైతు సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మహిళా విభాగం మాజీ జిల్లా అధ్యక్షురాలు గాయత్రీదేవి, పార్టీ రైతు విభాగం జిల్లా నాయకులు కృష్ణారెడ్డి, నాయకులు శ్రీధర్, ప్రకాష్ పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా కదలిరండి

పుత్తూరు: అన్నదాతను అన్ని విధాలుగా దగా చేస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ జిల్లా కలెక్టరేట్ వద్ద ఈనెల 13న నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులందరూ కలసి రావాలని మాజీ డిప్యూటీ సీఎంనారాయణస్వామి, జీడీనెల్లూరు ఇన్‌చార్జి కృపాలక్ష్మి పిలుపునిచ్చారు. పుత్తూరులో గురువారం వారు నిరసన గళం కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఎస్‌ఆర్‌పురం, పాలసముద్రం, జీడీనెల్లూరు, పెనుమూరు మండలాల పార్టీ కార్యకర్తలు, నాయకులు చిత్తూరు కలెక్టరేట్ వద్దకు, కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల నాయకులు, కార్యకర్తలు తిరుపతి కలెక్టరేట్‌కు ఉదయం 10 గంటలకు చేరుకోవాలన్నారు.

క్లుప్తంగా

1100 లీటర్ల సారా ఊట ధ్వంసం

– మాంగాడు దళితవాడలో దాడులు


నగరి : మండలంలోని మాంగాడు దళితవాడలో చిత్తూరు డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో డివిజన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సిబ్బందితో బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని ఎస్.దాము అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అనంతరం దళితవాడకు పడమర వైపున ఉన్న మురుగు కాలువ వద్ద 75 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. మాంగాడు దళితవాడకు ఉత్తరం వైపున మూడు కిలోమీటర్ల దూరంలో ఇందిరమ్మ చెరువు ప్రాంతంలో 1100 లీటర్ల సారా ఊటను కనుగొని ధ్వంసం చేశారు. ఆ మూడు కేసుల చర్యల కోసం నగరి ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ సురేంద్రబాబు, మునిరామయ్య, బీఎం కృష్ణయ్య, పీసీలు బి.విజయ్, కెఎస్ రాజ్‌దీప్, గీత పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

బంగారుపాళెం: మండలంలోని గురంకొండ వాండ్లఊరుకు చెందిన ఓ యువకుడిపై బుధవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. గ్రామానికి చెందిన తులసీరామ్(20) ఓ మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి గర్భవతిని చేసినట్లు చెప్పారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు తులసీరామ్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో గంజాయి విక్రయిస్తున్న టి.సుబ్రమణ్యం (41), జీసీ ఆటోచిట్టి (49), కె.రాజేష్ (40) అనే ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వన్‌టౌన్ సీఐ జయరామయ్య కథనం మేరకు.. నగరంలోని చామంతిపురం సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. బుధవారం వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనివాసులు తన సిబ్బందితో కలిసి ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. చిత్తూరు సీబీ రోడ్డుకు చెందిన సుబ్రమణ్యం, వినాయకపురానికి చెందిన ఆటో చిట్టి, బజారువీధికి చెందిన రాజేష్.. ఈ ముగ్గురు గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.62 వేలు విలువచేసే 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా, ఆయన రిమాండుకు ఆదేశించారు. దీంతో నిందితులను జిల్లా జైలుకు తరలించారు.



కార్వేటి నగరం మండలంలోని కృష్ణాపురం ప్రాజెక్టు

సాగునీటి సంఘాలకు ఎన్నికలు

జిల్లావ్యాప్తంగా సాగునీటి వినియోగదారుల ఎన్నికల సందడి మొదలైంది. కలెక్టరేట్, అధికారులు బుధవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆ మేరకు ఈ నెల 14వ తేదీన జిల్లావ్యాప్తంగా సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నారు. కలెక్టరేట్, ఇరిగేషన్ అధికారులు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

- జిల్లావ్యాప్తంగా 14వ తేదీన ఎన్నికలు
- నోటిఫికేషన్ జారీ
- ఏకగ్రీవం కాని చోట రహస్య ఓటింగ్
- మొదటిసారి బ్యాలెట్ పేపర్ విధానంలో సాగునీటి సంఘాల ఎన్నికలు
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల (డబ్ల్యూయూఏ) ఎన్నికల నిర్వహణకు సమయం ఆసన్నమైంది. కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ పర్యవేక్షణలో జిల్లావ్యాప్తంగా 220 నీటి సంఘాలకు ఈ నెల 14వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. అయితే మొదటిసారి సాగునీటి సంఘాల ఎన్నికలను బ్యాలెట్ పేపర్ విధానంలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేపడుతున్నారు. జిల్లాలోని 32 మండలాల్లో సంఘాల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసి క్షేత్రస్థాయిలో ప్రదర్శించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది ఏర్పాటుకు అధికారులు కసరత్తు నిర్వహిస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల పర్యవేక్షణ అధికారి డీఆర్‌ఓ మోహన్‌కుమార్ బుధవారం కలెక్టరేట్ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ముందు సర్వసభ్య సమావేశం..

జిల్లావ్యాప్తంగా 220 నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి గెలుపొందే వారితో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో సాగునీటి వినియోగదారుల సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. జిల్లాలో 215 సాగునీటి వినియోగదారుల సంఘాలు ఉండగా, వాటి పరిధిలో ఐదు మీడియం ప్రాజెక్టు డిస్ట్రిబ్యూషన్ కమిటీ సంఘాలు ఉన్నాయి. వాటితో కలిపి మొత్తం 220 సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ సంఘాల పరిధిలో 36,258 మంది పురుషులు, 12,772 మహిళలు మొత్తం 49,030 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

జిల్లా సాగునీటి సంఘాల ఎన్నికల సమాచారం	
ఎన్నికలు జరిగే సాగునీటి సంఘాలు	220
మైనర్ ఇరిగేషన్ చెరువులు	215
మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టు (కృష్ణాపురం)	05
పురుష ఓటర్లు	36,258
మహిళా ఓటర్లు	12,772
మొత్తం ఓటర్లు	49,030

పాఠశాలలే పోలింగ్ కేంద్రాలు..

జిల్లావ్యాప్తంగా ఆయా మండలాల్లో ప్రభుత్వ స్కూళ్లను పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. 1,357 పోలింగ్ కేంద్రాలకు 220 మంది ఎన్నికల అధికారులు, 152 అసిస్టెంట్ ఎన్నికల అధికారులు, 1357 మంది పీఓలు, 1357 మంది ఏపీఓలను ఎన్నికల విధులకు కేటాయిస్తున్నారు. అదేవిధంగా ఒక పోలింగ్ కేంద్రంలో ఇద్దరు పోలీసుల చొప్పున బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

రహస్య బ్యాలెట్ విధానంలో ఎన్నికలు

సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఈ నెల 4న రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎక్కడైనా ఏకగ్రీవ ఎన్నిక జరగని సందర్భాల్లో చేతులెత్తి ఎన్నుకునే విధానాన్ని అనుసరిస్తే ఓటర్లు ఎవరికి ఓటు వేశారో అభ్యర్థులకు తెలిసిపోతుంది. అందువల్ల వారిని లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉంటుంది. మేనేజ్‌మెంట్ ఆఫ్ ఇరిగేషన్ సిస్టమ్స్ (ఎన్నికల నిర్వహణ) రూల్స్, 118 ప్రకారం చేతులెత్తే పద్ధతి రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) ప్రసాదించిన భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తుంది. అందువల్ల ఏకాభిప్రాయం కుదరని చోట రహస్య బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకుంటామనే రైతులను.. అందుకు అనుమతించాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ విషయాలను ఇటీవల జిల్లా అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ప్రస్తావించారు. అలాగే ఓటర్లందరికీ 14వ తేదీన ఓటర్ స్లిప్పులు అందజేయనున్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు



జిల్లాలో 14న జరిగే సాగునీటి సంఘాల ఎన్నికల కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టడంతో పాటు నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఎన్నికల నిర్వహణపై క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ నెల 13వ తేదీన జిల్లా ఇరిగేషన్ కార్యాలయం నుంచి ఆయా మండలాలకు ఎన్నికల సామగ్రిని ప్రత్యేక వాహనాల్లో 32 మండలాలకు తరలించడం జరుగుతుంది.

– సుమిత్ కుమార్ గాంధీ,
జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, చిత్తూరు

గ్రామాల్లో దండోరా..



సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి గ్రామాల్లో దండోరా వేయించాలని ఆదేశించాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి ఏర్పాట్లను ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకుని పర్యవేక్షిస్తున్నాం. ఈ నెల 14వ తేదీన జరిగే ఎన్నికల కోసం అవసరమైన సిబ్బంది నియామకాలు పూర్తి చేశాం. విధులు కేటాయించిన సిబ్బంది తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించాం.

– మోహన్‌కుమార్,
జిల్లా ఎన్నికల పర్యవేక్షణ అధికారి, డీఆర్‌ఓ

ప్రభుత్వ భూమిలో టీడీపీ నేతల పాగా



టీడీపీ నాయకులు చదును చేసిన ప్రభుత్వ భూమి

పాలసముద్రం : అధికారం అండ చూసుకుని టీడీపీ నేతలు ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే కబ్జా చేస్తున్నారు. పాలసముద్రం దళితవాడలో ప్రభుత్వ భూమి, గ్రామనత్తాన్ని అధికార పార్టీ టీడీపీ నాయకులు గత రెండు రోజులుగా జేసీబీతో అక్రమంగా చదును చేసుకున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దళితవాడలో ఎన్నడూ లేనివిధంగా టీడీపీ నాయకులు దౌర్జన్యాలు మితిమీరిపోతున్నాయి. పాలసముద్రం దళితవాడ సుమారు రెండువేల కుటుంబాలు నివసిస్తున్నారు. భవిష్యత్‌లో పేదలకు ఇంటి పట్టాల కోసం ఉంచిన ప్రభుత్వ స్థలాన్ని అధికారాన్ని అడ్డు పెట్టుకుని టీడీపీ నాయకులు దౌర్జన్యంగా జేసీబీతో చదును చేయించి కొబ్బరిచెట్లు నాటుతున్నారు. అయినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమంగా జేసీబీతో చదును చేసిన భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నారు. ఇంటి పట్టా లేనివారికి పట్టాలు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- పగలూ, రాత్రి తేడా లేకుండా తెల్లబంగారం తరలింపు
- గ్రామాల్లో డంప్ చేసి.. చీకటి పడగానే తమిళనాడుకు తరలిస్తున్న వైనం
- అక్రమార్కులకు సహకరిస్తున్న పోలీసులు
- నంబరు ప్లేట్లు లేని ట్రాక్టర్లలో మైనర్లచే సరిహద్దులు దాటిస్తున్న అక్రమార్కులు

విజయపురం : మండల కేంద్రం విజయపురంతో పాటు తమిళనాడుకు చెందిన గ్రామాలకు పగలు, రాత్రి అనే తేడా లేకుండా యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. సంబంధిత అధికారులు నిఘా పెట్టకపోవడంతోనే కొందరు ఇసుక వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా, ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా ఇసుక దందా కొనసాగిస్తున్నారు. అక్రమార్కులు అదును చూసి ఇష్టారాజ్యంగా ఇసుకను తరలిస్తూ రూ.కోట్లు వెనుకేసుకుంటున్నారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమిళనాడు సరిహద్దులో ఉన్న మహరాజపురం, శ్రీహరిపురం, మల్లారెడ్డికండ్రిగ, ఇల్లత్తూరు, కేవీశ్రీరాపురంలో అక్రమార్కులు ఇసుకను డంప్ చేసి రాత్రి పూట తమిళనాడుకు తరలిస్తున్నట్లు సమాచారం.

నంబరు ప్లేటు లేని వాహనాల్లో..

మండల కేంద్రంలో తిరిగే చాలా ట్రాక్టర్లకు నంబర్ ప్లేట్లు లేవు. గుట్టు చప్పుడు కాకుండా నంబరు ప్లేటు లేని ట్రాక్టర్లలో మండల సరిహద్దును దాటుకుని తమిళనాడుకు రోజూ ఇసుకను తరలించేస్తున్నారు. అంతేకాకుండా ఈ నంబరు ప్లేట్లు లేని ఇసుక ట్రాక్టర్లను ఎక్కువగా మైనర్లే నడుపుతుండడం విశేషం. వీరు అతివేగంగా నడపడం వల్ల ఇతర వాహనదారులు, గ్రామీణ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఓవర్ స్పీడ్‌తో వస్తున్న ఇసుక ట్రాక్టర్లను చూసి బెంబేలెత్తిపోతున్నారు. ట్రాక్టర్లను యథేచ్ఛగా మైనర్లు డ్రైవింగ్ చేస్తున్నా.. పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు వాపోతున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు తనిఖీలు చేపట్టి ఇసుక వాహనాలను స్వాధీనం చేసుకుని నామమాత్రపు జరిమానాలు విధిస్తూ వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



కేవీశ్రీరామపురం సరిహద్దులో రాత్రి పూట నంబర్ ప్లేటు లేని ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్న దృశ్యం

సర్వేలోనూ చిన్నచూపేనా..!

సంచార జాతుల వారిని గుర్తించేందుకు చేపట్టిన సీడ్ సర్వేలోనూ సిబ్బంది చిన్నచూపు చూశారు. వారికి ప్రభుత్వం నుంచి సాయం అందించాలన్న ఉద్దేశంతో చేపట్టిన లక్ష్యం నీరుగారుతోంది. క్షేత్రస్థాయిలో సచివాలయ సిబ్బంది సంచార జాతుల వారు లేని చోటకు వెళ్లి మీరు సంచార జాతుల వారు కాదు కదా అంటూ నమోదు చేసుకున్నారు. ఆపై మొత్తంగా అసలు సంచార తెగల వారు లేరని నివేదిక ఇచ్చారు. ఎంపీడీఓలు ఈ సీడ్ సర్వేపై దృష్టి సారించకపోవడం వల్లే ప్రభుత్వ ఆశయం పక్కదారి పట్టింది. దీనిపై బీసీ, ఎంబీసీ సంఘాల నేతల నుంచి ఆగ్రహం వ్యక్తం కావడంతో మరోమారు సీడ్ సర్వే చేయాలని బీసీ కార్పొరేషన్ ఈడీ, కలెక్టర్ ఆదేశించారు.







గ్రామాల్లో రకరకాల పనులు చేసుకుంటూ కడుపు నింపుకుంటున్న సంచార జాతుల వారు

- తూతూమంత్రంగా సంచారజాతుల సర్వే
- స్కూళ్లలో తోటి విద్యార్థులు గేలి చేస్తుండడంతో కూలీలుగా మారుతున్న సంచార జాతుల పిల్లలు
- అటువైపు వెళ్లకుండానే ఎవరూ లేరని నివేదిక
- బీసీ, ఎంబీసీ సంఘాల నేతల ఆగ్రహం
- సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యపు సర్వే
- మరోమారు సర్వే చేయాలని బీసీ కార్పొరేషన్ ఈడీ, కలెక్టర్ ఆదేశాలు

పలమనేరు: వెనుకబడిన తరగతుల్లోని అట్టడుగున ఉన్న సంచార, విముక్తి జాతులకు చెందిన వారికి జీవనోపాధి కల్పనతో పాటు ఆర్థిక భరోసా ఇచ్చేందుకు బీసీ సంక్షేమ శాఖ (సీడ్) (సంచార జాతుల ఆర్థిక సాధికారిత పథకం) సంచార జాతుల సర్వేని చేపట్టాలని ఆదేశించింది. అందులో వారి సమగ్రమైన వివరాలను అందించాలని తెలిపింది. కానీ సర్వే చేస్తున్న సచివాలయాల సిబ్బంది మాత్రం అసలు ఆయా మండలాల్లో సంచార జాతులే లేరని తప్పుడు సర్వే నివేదిక ఇచ్చి చేతులు దులుపుకున్నారు. దీంతో జిల్లాలోని సంచార జాతులకు ప్రభుత్వం ద్వారా జరిగే మేలు కూడా జరగకుండా పోతోంది.

నీరుగారిపోతున్న లక్ష్యం..

రాష్ట్రంలో 42 సంచార, విముక్తి జాతులు ఉన్నట్టు ప్రభుత్వం వద్ద సమాచారం ఉంది. ఇందులో బీసీ-ఏ జాబితాలో 36 కులాలు ఉన్నట్టు తెలుస్తోంది. వీరిని క్షేత్రస్థాయిలో గుర్తించి వారి వాస్తవ పరిస్థితులు, వారు ఏమి కోరుకుంటున్నారు ? వారు బాగుపడాలంటే ఎలాంటి చర్యలు తీసుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ సర్వేను చేపట్టింది. తద్వారా వీరికి ఉపాధి కల్పన, వీరి పిల్లలకు చదువు, వారు చేస్తున్న వ్యాపారాలకు 50 శాతం సబ్సిడీతో జాతీయ వెనుకబడిన తరగతుల ఆర్థికాభివృద్ధి సంస్థ(ఎన్‌బీసీఎఫ్‌డీసీ) ద్వారా రుణాలను అందించి వారు ఆర్థికంగా బాగుపడేలా చేయాలనేది ముఖ్య లక్ష్యం.

కులం పేరిట అవమానాలు..

ఈ ప్రాంతంలోని సంచార తెగలు, కులాలపై సమాజంలో చిన్నచూపు ఉంది. వారు మనలాంటి మనుషులే కదా అని సమాజం భావించడం లేదు. వారిని సమాజం అమర్యాదగా చూస్తుండడంతో వారు కులం పేరు చెప్పుకోవడానికి సైతం నామోషీగా భావిస్తున్నారు. వీరి పిల్లలు అక్కడక్కడా స్కూళ్లలో చేరినా తోటివారు వారిని గేళి చేస్తున్నారు. మీరు పాములు పట్టేవారు కదా.. గంగిరెద్దులను ఆడిస్తారా ? ఎలుకలను తింటారా..! అంటూ తోటి పిల్లల వేధింపులతో 30శాతం మంది పిల్లలు ప్రాథమిక విద్యకు సైతం దూరమవుతున్నారు. ఆపై కార్మికులు, కూలీలుగా మారుతున్నారు. టీచర్లు సైతం వారిని హేళన చేస్తున్నట్టు తెలుస్తోంది. వారి తల్లిదండ్రుల వృత్తి, అలవాట్లు, కనీసం కులధ్రువీకరణ పత్రాలు కూడా లేక చదువుకోవాలనే ఆశ ఉన్నా వారిని తల్లిదండ్రులు బడికి పంపడం లేదు.

అసలు సంచార జాతులంటే ..!

సంచార కులాలంటే వీరు ఓ చోట శాశ్వతంగా ఉండరు అని అర్థం. కొంతకాలం ఓ చోట మళ్లీ ఎక్కడో జీవనం సాగిస్తుంటారు. గ్రామాలకు దూరంగా గుడారాలు వేసుకుని కొన్నాళ్లు ఉండి మరో ప్రాంతానికి వెళ్లిపోతుంటారు. జిల్లాలోని పలమనేరు, కుప్పం ప్రాంతంలో ఇలాంటి వారు ఎక్కువగా ఉంటున్నారు. గ్రామాల్లో పక్క పిన్నులు, బెలూన్లు, ఎలుక మందులు, కొరడాలతో కొట్టుకునేవాళ్లు, వెంట్రుకలు కొనుగోలు చేసేవారు, పాములు ఆడించేవారు కనిపిస్తున్నారు.

1.20 లక్షలమంది సంచార జాతుల వాసులు

జిల్లాలో 90 వేలమంది సంచార జాతులు, తెగలు, బీసీ ఏ కేటగిరి నుంచి మారిన మరో 30 వేల మంది మొత్తం 1.20 లక్షల మంది ఇక్కడ సంచార జాతుల జాబితాలో ఉన్నారనేది బీసీ సంక్షేమశాఖ రిపోర్టు. కానీ ఇటీవల చేపట్టిన సీడ్ సర్వే చేసిన సచివాలయ ఉద్యోగులు 10 మండలాల్లో అసలు ఇలాంటి సంచార జాతులే లేరంటూ నివేదికలు పంపారు. సంబంధిత ఎంపీడీఓల పర్యవేక్షణ లేకనే ఈ సమస్య వచ్చినట్టు తెలుస్తోంది. ఇప్పటిదాకా అందించిన సర్వేలో పెనుమూరులో 23 మంది, వెదురుకుప్పంలో 86 మంది, చౌడేపల్లిలో 160 మంది, పెద్దపంజాణిలో 18 మంది మాత్రమే ఉన్నట్టు నివేదించారు. ఇక పలమనేరు, బైరెడ్డిపల్లి, వీకోట, గంగవరం, శాంతీపురం, రామకుప్పం, నగరి తదితర మండలాల్లో అసలు ఇలాంటి వారేలేరనే రిపోర్టు ఇచ్చారు. సగానికి పైగా మండలాల్లో అసలు సీడ్ సర్వే ఇంకా మొదలు కాలేదు. దీనిపై మండిపడిన బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, కలెక్టర్ సుమిత్‌కుమార్ మళ్లీ సమగ్రంగా సర్వే చేయించాలని, ఆ నివేదికలను సంబంధిత ఎంపీడీఓలకు పంపారు.

ఇప్పుడైనా కచ్చితమైన సర్వే చేస్తారా..!

సచివాలయాల పరిధిలో ఇప్పటికైనా సంచార జాతులను కచ్చితంగా గుర్తించి, పటిష్టంగా సర్వే నిర్వహించేలా ఎంపీడీఓలు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనిపై కలెక్టర్ దృష్టి సారించాల్సింది ఉంది. మరోవైపు రాష్ట్ర ఎంబీసీ నాయకులు రవి పూసల ఈ విషయాన్ని జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



మృతుడు సురేంద్రరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన పులిచెర్ల మండలం నన్నూరు వారిపల్లె పంచాయతీ కుంటావారిపల్లె సమీపంలో జరిగినట్లు కల్లూరు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. తిరుపతికి చెందిన లారీ యజమాని నారాయణరెడ్డి కుంటావారిపల్లె సమీపంలో తన లారీ నిలిచిపోవడంతో డ్రైవర్‌ను పిలుచుకుని బుధవారం ఉదయం వచ్చాడు. డ్రైవర్ సురేంద్రరెడ్డి(55) లారీని పక్కకు పెట్టగా, అటుగా వెళ్లే వారు దారికి అడ్డంగా ఉందని చెప్పడంతో మరోమారు వాహనాన్ని పక్కకు పెడుతుండగా కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు లారీకి తగిలాయి. ఈక్రమంలో డ్రైవరు విద్యుత్ తీగలు తగిలిన లారీని ముట్టుకోవడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కల్లూరు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పత్రాలతో హాజరు కావాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఏపీఎస్‌ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ చేసేందుకు వివిధ ట్రేడ్‌లో ఎంపికైన అభ్యర్థులు ఈనెల 17వ తేదీన గుర్తింపు పత్రాలతో కార్యాలయానికి హాజరు కావాలని డీపీటీఓ జగదీష్ తెలిపారు. ఉదయం 10 గంటలకు చిత్తూరు నగరం ఆర్టీసీ బస్టాండులోని డీపీటీఓ కార్యాలయానికి గుర్తింపు పత్రాలతో హాజరు కావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులను డిపోల వారీగా కేటాయిస్తామని ఆయన తెలిపారు.

మైనర్ బాలిక ఆత్మహత్య

యాదమరి (కాణిపాకం): ఓ యువకుడి వేధింపులను తాళలేక మైనర్ బాలిక బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం యాదమరి మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఈశ్వర్ తెలిపిన వివరాల మేరకు.. పాచిగుంట గ్రామానికి చెందిన వసంత్‌కుమార్ అనే యువకుడు మైనర్ బాలిక నుంచి బంగారు, వెండి ఆభరణాలను తీసుకున్నాడు. తర్వాత ఆ నగలను తిరిగి ఇవ్వాలని మైనర్ బాలిక పట్టుబట్టడంతో సదరు యువకుడు వేధింపులకు గురి చేశాడు. దీంతో మైనర్ బాలిక బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు వసంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

10 మంది డిబార్

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో జరుగుతున్న డిగ్రీ మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న 10మంది విద్యార్థులను డిబార్ చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జోన్ పరిధిలో ముగ్గురు, చిత్తూరు జోన్ పరిధిలోని పరీక్ష కేంద్రాల్లో ఏడుగురు డిబార్ చేసినట్లు ప్రకటించారు.